
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 26 సెప్టెంబరు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.10 (309.3558)	49,234	46,120
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.179)	3390.14	3240.77
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.86 (45.56)	33,460	36,950

చికెన్ ధరలు | లైవ్ : రూ.158 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

మూకుమ్మడి సెలవులివ్వండి

నల్లగొండ జిల్లాలో ఒక ఎంపీడీవో, ఇద్దరు గ్రామపంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసిన వ్యవహారంపై దుమారం చెలరేగుతోంది. విధుల్లో నిర్లక్ష్యం వహించి, రాతపూర్వకంగా ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోలేదని, ప్రత్యేకాధికారుల తనిఖీ సమయంలో అందుబాటులో లేని కారణాలతో వీరిని సస్పెండ్ చేశారు. అయితే తమ పనిభారాన్ని గుర్తించకుండా ఏకపక్షంగా సస్పెన్షన్ విధించారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ఆదేశాలను వెనక్కి తీసుకొని విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే నిరవధికంగా మూకుమ్మడి సెలవుల్లోకి వెళ్లేందుకు అనుమతించాలని కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



వేములపల్లిలో ఎంపీడీవో శారదా దేవికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

- పంచాయతీ కార్యదర్శుల అల్టిమేటం
- ఒక ఎంపీడీవో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్‌తో చెలరేగిన వివాదం
- ఏకపక్షంగా చర్యలు తీసుకున్నారనే వాదనను తెరమీదకు తెచ్చిన కార్యదర్శులు
- పంచాయతీల్లో నిర్వహణ బిల్లులు, పంచాయతీ ఆడిట్‌లపై నిరసన వ్యక్తం చేస్తోన్న కార్యదర్శులు

పంచాయతీల నిర్వహణ, పర్యవేక్షణ విషయంలో ఎంపీడీవోలనే బాధ్యులను చేయడంపై ఎంపీడీవోల సంఘం నేతలూ ఆందోళన వ్యక్తంచేశారు. ఎంపీవోలు,డీఎల్‌పీవోలు, డీపీవోలకు కూడా పంచాయతీల నిర్వహణ బాధ్యతలుంటాయని,అలాంటిది కేవలం ఎంపీడీవోలనే బాధ్యులను చేసి సస్పెన్షన్ విధించడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జిల్లాలోని గుర్రంపోడు ఎంపీడీవో పి.మంజుల, పెద్దవూర మండలం పులిచెర్ల పంచాయతీ కార్యదర్శి కె.నాగరాజు, దామరచర్ల మండలం వాచ్యాతండ జూనియర్ కార్యదర్శి కె.స్వప్నను విధులపట్ల నిర్లక్ష్యం వహించిన కారణంగా నల్లగొండ కలెక్టర్ సీ.నారాయణరెడ్డి సస్పెండ్ చేయగా, బుధవారం పంచాయతీ కార్యదర్శులు ఈచర్యలను వెనక్కితీసుకోవాలని, లేకపోతే తమకు మూకుమ్మడి సెలవులివ్వాలంటూ అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలందజేయడంతో, తదుపరి ఎలాంటి పరిస్థితి రాబోతోందని ఉద్యోగవర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించనందుకు..


వర్షాకాల నేపథ్యంలో జిల్లాలోని పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు, మొక్కలపెంపకం, ఫాగింగ్, చెత్త తరలింపు, మురుగుకాల్వల నిర్వహణ, బ్లీచింగ్ చల్లడం వంటి కనీస కార్యాచరణ ఖచ్చితంగా అమలుచేయాలని రాతపూర్వకంగానూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించినందునే ఈ కార్యదర్శులను విధుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పెద్దవూర మండలం పులిచర్లకు చెందిన పంచాయతీ కార్యదర్శి నాగరాజు అనధికారికంగా విధులకు గైర్హాజరవడంతోపాటు, గ్రామంలో పారిశుధ్యం, చెత్త సేకరణ, ప్లాంటేషన్ విషయాల్లో నిర్లక్ష్య వైఖరివల్ల సస్పెన్షన్ విధిస్తున్నట్లు పేర్కొన్నారు.దామరచర్ల మండలం వాచ్యాతండ కార్యదర్శి స్వప్నమొక్కల పెంపకం, పారిశుధ్యం, తదితర విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నందున సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా అన్నిపంచాయతీలకు గడ్డికోత యంత్రాలను కొనుగోలు చేయాలని ఆదేశించినప్పటికీ గుర్రంపోడు మండలంలో 37కి 10 పంచాయతీల్లోనే కొన్నారని, మిగిలిన చోట్ల నిర్లక్ష్యం వహించారని, అదేవిధంగా మొక్కలపెంపకం, కంపోస్ట్ షెడ్, పారిశుధ్య కార్యక్రమాల సక్రమంగా నిర్వహించని కారణాలతో గుర్రంపోడు ఎంపీడీవో మంజులను సస్పెండ్ చేశారు.

గ్రామాల్లో ఇన్‌చార్జిల పంచాయితీ

మిర్యాలగూడ రూరల్: ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాలకు నిధుల కొరత ఏర్పడడంతో తాము అప్పులు తెచ్చి మరీ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య పనులను చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్ చట్టంలో లేనప్పటికీ పనులు చేపట్టేందుకు సొంత డబ్బులు వెచ్చించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారని, అలా చేయకపోతే గ్రామాల్లో పనులు చేపట్టడం లేదని ఆరోపిస్తూ తమను బెదిరిస్తున్నారని, సస్పెండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలు మరో 3,4 నెలలు పడుతుందని, అప్పటివరకు ఎలాంటి బిల్లులు అందకుండా గ్రామాల్లో ప్రజా సమస్యలను ఎలా పరిష్కరించాలని వారు ప్రశ్నిస్తున్నారు.

మూకుమ్మడి సెలవుల్లోకి వెళ్లేందుకు..

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం గుర్తించకుండా అకారణంగా సస్పెన్షన్ వేటు విధించడాన్ని నిరసిస్తూ జిల్లాలోని 844పంచాయతీ కార్యదర్శులంతా బుధవారం గూగుల్‌మీట్ ద్వారా సమావేశమై ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేశారు. ఇతర జిల్లాల్లో లేనివిధంగా ఇక్కడ జీపీ ఆడిట్ నిర్వహించి మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తూ సస్పెన్షన్ వేటు వేస్తున్నారని ఆందోళనచేస్తూ మూడు డిమాండ్లను తెరమీదకు తెచ్చారు. పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్ ఎత్తివేసి తక్షణం వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిది నెలల్లో పంచాయతీ కార్యదర్శులు చేయించిన పనులకు బిల్లులు ఇవ్వాలని, అదేవిధంగా బదిలీ అయిన కార్యదర్శులకు సంబంధించిన బిల్లులు కూడా చెల్లించేలా మార్గం చూపాలని కోరుతున్నారు.రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పంచాయతీ స్పెషల్ ఆడిట్ పేరుతో మండల ప్రత్యేక అధికారుల బెదిరింపుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మూడు డిమాండ్లు నెరవేర్చకపోతే గురువారం నుంచి తమకు సామూహిక సెలవు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం అన్ని మండలాల ఎంపీడీవోలకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాలిచ్చారు. పంచాయతీ కార్యదర్శుల అల్టిమేటంతో కలెక్టర్ తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై ఉద్యోగవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కార్యదర్శుల అల్టిమేటం మేరకు సస్పెన్షన్ ఎత్తివేస్తారా? లేక ఇతర అంశాలను సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారా? అనే అంశంపై చర్చ సాగుతోంది.





హైదరాబాద్‌లో జిల్లా నేతలతో సమావేశమైన కేటీఆర్

ప్రజా సమస్యలపై పోరాడుదాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పార్టీ బలోపేతానికి, ప్రజాసమస్యలపై పోరాటాలకు దిశానిర్దేశం

త్వరలో ముఖ్యనేతలతో నియోజకవర్గాల్లో పర్యటిస్తానని హామీ

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి నివాసంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఉద్యమిద్దామని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ నేతలు చేస్తున్న అరాచకాలపై ఎక్కడికక్కడ నిలదీద్దామన్నారు. త్వరలో పార్టీ నేతలతో కలిసి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేదిశగా కార్యాచరణ చేపట్టాలన్నారు. కార్యకర్తలకు ధైర్యమిచ్చేలా కార్యక్రమాలు నిర్వహించి, వారికి అండగా ఉండాలన్నారు. కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచకాలు, అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. అధికార, అహంకారదర్పంతో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారని, వారి ఆగడాలను ప్రజలకు వివరించాలన్నారు.

జిల్లాలో ఫ్లోరోసిస్ మళ్లీ పెరిగింది

జిల్లాలో ఫ్లోరోసిస్ మళ్లీ పెరిగిందని, తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయని కేటీఆర్ అన్నారు. పంచాయతీల నిర్వహణను గాలికొదిలేశారని, ప్రజలు సమస్యల్లో ఉన్నారని వివరించారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వారి సమస్యల తరఫున బీఆర్ఎస్ నిలబడి పోరాడుతుందన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్యేలు తమతమ నియోజకవర్గాల్లోని సమస్యలతోపాటు కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలిని కేటీఆర్ దృష్టికి తెచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలందరి అభిప్రాయాలను విన్న కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎం.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, గొంగిడి సునీతారెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పైళ్లశేఖర్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, భిక్షమయ్యగౌడ్, జడ్పీ మాజీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, సందీ‌ప్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు భరత్‌కుమార్, కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, దయాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 25: వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ, పునరావాస కేంద్రాల పనులకు సంబంధించిన పెండింగ్ పనులను ప్రాధాన్యతా క్రమంలో విభజించుకొని పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో పునరావాస కేంద్రాలు, భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాజెక్టుల కింద రిజర్వాయర్లు, తదితర చోట్ల ఆర్‌అండ్‌ఆర్ పనులు, అలాగే భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వెంటనే సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని వేగవంతం చేయాలన్నారు. ఉదయ సముద్రం సర్వేకు ప్రత్యేకించి ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీని ఆదేశించారు. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పెండింగ్ అవార్డు పనులను పూర్తిచేయాలని, అదేవిధంగా పెండ్లిపాకల కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణను సైతం త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎఫ్‌వో రాజశేఖర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఆర్డీవోలు, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

ఐదు రోజులపాటు వయోవృద్ధుల వారోత్సవాలు

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 25: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం అక్టోబరు ఒకటో తేదీని పురస్కరించుకొని ఐదు రోజులపాటు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర తెలిపారు. బుధవారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాలు-2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో ఈ నెల 26న వయోవృద్ధులకు క్రీడాపోటీలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతి ప్రదానం చేస్తామన్నారు. 27న వయోవృద్ధుల హక్కులపై 'మారథాన్' నిర్వహిస్తామన్నారు. 28న తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం-2007పై జిల్లాస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 29న జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో సర్పంచులు, గ్రామస్థాయి అధికారులకు తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టంపై అవగాహన కల్పిస్తామన్నారు. 30న గ్రాండ్ పేరెంట్స్ డేను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో ఒకటో తేదీన సమావేశం ఉంటుందని, కలెక్టర్ హాజరై ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 25: మునిసిపాలిటీల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీ వేజ్ తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ మునిసిపల్ కార్పొరేషన్‌లలో సుమారు 65వేల మంది శానిటేషన్, నీటి సరఫరా, ట్రాక్టర్ డ్రైవర్, ఎలక్ట్రిసిటీ, డంపింగ్ యార్డ్, పార్కుల నిర్వహణ తదితర విభాగాల్లో పనిచేస్తున్నారన్నారు. పర్మినెంట్, కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లాంటి ప్రభుత్వ సంక్షేమాలు, కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించడం లేదన్నారు. పని చేస్తున్న సమయాల్లో అనేకమంది కార్మికులు ప్రమాదాలు జరిగి మరణిస్తున్నారని, వారికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. కార్మికులను పర్మినెంట్ చేసేలోపు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. అన్ని మునిసిపాలిటీల్లో ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అవుత సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిట్ట నగేష్, పెరికృష్ణ, పేర్ల సంజీవ, కత్తుల సైదులు, నల్లగంటి లింగస్వామి, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నా కార్మికులు

మాదక ద్రవ్యాల రహిత సమాజమే ధ్యేయం

ఎస్పీ శరత్ చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 25: మాదక ద్రవ్యాలు, గంజాయి రహిత సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మెడికల్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలు ఒక వ్యసనం లాంటివని, వాటి బారిన పడితే జీవితంలో కోలుకోలేరని, ప్రశాంతంగా ఉండే జీవితం కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ఒక్కసారి డ్రగ్స్, గంజాయి తాగి పట్టుపడితే ఆరు నెలల వరకూ జైలు శిక్ష పడుతుందన్నారు. జిల్లాలో ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు సేవించినా, విక్రయించినా, రవాణా చేసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 8712670266కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు నాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివాని, సూపరింటెండెంట్ అరుణకుమారి, సైక్రియాట్రిస్ట్ డాక్టర్ శికుమార్, టూటౌన్ సీఐ డానియల్ కుమార్, ఎస్ఐ రావుల నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

నేర పరిశోధనలో మెళకువలు పెంపొందించుకోవాలి

పోలీసులు విధి నిర్వహణలో కేసుల దర్యాప్తు, నేర పరిశోధనలో మెళకువలు ఎంతో దోహదపడుతాయని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. కేసుల దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, నేర పరిశోధన, ఫొటోగ్రఫీ, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీంలాంటి పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. జిల్లాస్థాయిలో నిర్వహించే కేసుల దర్యాప్తునకు సంబంధించిన ప్రతి అంశంలో పట్టుసాధించి జిల్లాస్థాయినుంచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, ఎస్‌బీ సీఐ రాఘవరావు, ఆర్ఐలు శ్రీను, సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డాగ్ స్క్వాడ్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

గ్రూపులతో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్

- ప్రజల దృష్టి మరల్చేందుకే 'హైడ్రా'
- యాదగిరిగుట్టలో మాజీ మంత్రి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 25: సీఎం, భట్టి, ఉత్తమ్ గ్రూపులతో కాంగ్రెస్ పార్టీ కొట్టుమిట్టాడుతోందని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుణ మాఫీ, రైతుబంధుపై ఊరించే ధోరణి మానుకుని రైతులను మభ్యపెట్టకుండా స్పష్టత ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంతో పోటీ పడి అభివృద్ధి చేయాలి కానీ కేసీఆర్, కేటీఆర్‌పై విరుచుకుపడటం సరికాదన్నారు. అభివృద్ధి చేయలేని కాంగ్రెసోళ్ల అసమర్థత తొమ్మిది నెలల్లో తేలిపోయిందన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు 'హైడ్రా' పేరు తో రాష్ట్రంలో హైరానా సృష్టిస్తున్నారని మండిపడ్డా రు. ముందుగా బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌ను గుర్తించి తర్వాత కూల్చివేయకుండా ఆగమేఘాలపై కూల్చేయడం సరైన నిర్ణయం కాదన్నారు. ముందుగా డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించి అందులోకి ప్రజలు వెళ్లిన తర్వాత మార్కింగ్ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇళ్లను కూల్చి వేయాలన్నా రు. అలా కాకుండా హైడ్రా పేరుతో హైదరాబాద్ లో అలజడి సృష్టిస్తున్నారని విమర్శించారు. తన కళాశాలలకు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ హయాంలో నిర్మించిన తన కళాశాలలు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఉంటే తప్పకుండా తొలగిస్తానని సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఆలయాలు, ఐటీ పరిశ్రమలు, ఫ్లైఓవర్లు, గురుకుల పాఠశాలలు నిర్మించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,769 పంచాయతీల్లో నర్సరీలు, క్రీడామైదానాలు, డంపింగ్, గ్రేవీ యార్డులు, తాగునీరు, 24గంటల విద్యుత్ అందజేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేశానికే అన్నం పెట్టే విధంగా రైతుల అభ్యున్నతికి పాటుపడిన నాయకుడు కేసీఆర్ అని, మూడేళ్ల ముందు మూడు లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించిన కేసీఆర్‌ను దాటేవారున్నారా..? అని ప్రశ్నించారు. ప్రస్తుతం రైతులతో అంత కంటే ఎక్కువ పంటలు పండిస్తే క్షీరాభిషేకం చేస్తామన్నారు.

గ్రామానికో సహాయకుడికి శిక్షణ

మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు

మునుగోడు, సెప్టెంబరు 25: గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో కలుషిత జలాలు వంటి సమస్యలు పరిష్కరించి, సరఫరా మెరుగుకోసం మల్టీపర్పస్ కార్మికుల్లో ఒకరికి సహాయకుడిగా శిక్షణ ఇస్తున్నట్లు మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మునుగోడు, చండూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో ఒక మల్టీపర్పస్ కార్మికుడికి సహాయకుడిగా నీటి సరఫరా మెరుగుకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా చేసేందుకు సిబ్బంది కొరత నేపథ్యంలో గ్రామానికో మల్టీపర్పస్ కార్మికుడిని సేవకుడిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. దీంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యం నెరవేరేందుకు సిబ్బంది తమ పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.పూజ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ముజీబుద్దీన్, ఎంపీవో స్వరూపరాణి, మునుగోడు, చండూరు మండలాల ఏఈలు బీ. మణిదీప్, ఎస్. రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



మునుగోడులో గ్రామ సహాయకులకు శిక్షణ ఇస్తున్న మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు


నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్

దేవరకొండ, సెప్టెంబరు 27: ప్రభుత్వ ప్రైవేట్ వైద్యులు, ఆస్పత్రుల నిర్వాహకులు వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు చేపడుతామని డీఎంహెచ్‌వో పి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం దేవరకొండ ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో దేవరకొండ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రైవేట్ వైద్యులు, ఆస్పత్రుల నిర్వాహకులు, ల్యాబ్‌ల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు అర్హత బోర్డులు, ఫీజుల జాబితా ఆస్పత్రుల ఎదుట ఏర్పాటు చేయాలన్నారు. ఎంబీబీఎస్ స్థాయి డాక్టర్ ఉంటేనే ల్యాబ్‌ల పరీక్షలు నిర్వహించాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే విచారణచేసి తనిఖీలు చేపట్టి చర్యలు చేపడుతామన్నారు. రోగులపట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ మాస్‌మీడియా అధికారి తిరుపతిరెడ్డి, దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, నిర్వాహకులు, ల్యాబ్‌ల నిర్వాహకులు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ చిన్నారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఈ చిన్నారెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 25: గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ చెన్నారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తిప్పర్తి, నల్లగొండ మండలాల తాగునీటి సరఫరా విభాగానికి సంబంధించిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుచుకోవాలని, క్లోరినేషన్ చేసుకోవాలని, పైపుల మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ శాంతకుమారి, డీఈ సంపత్, ఎంపీడీవో వెంకటరెడ్డి, ఏఈ షఫీయుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

11 మంది ఎస్ఐలకు స్థానచలనం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న 11 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పోటీ పరీక్షలతోనే పరిజ్ఞానంపై అవగాహన

నల్లగొండ, శాలిగౌరారం, సెప్టెంబరు 25: పోటీ పరీక్షలతోనే విద్యార్థులకు పరిజ్ఞానంపై అవగాహన కలుగుతుందని నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం దోమలపల్లి హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. పరీక్షలతో విద్యార్థులకు లాజికల్‌థింకింగ్, మెంటల్ ఎబిలిటీ, సైన్స్, సాంఘిక శాస్త్రాల్లో అవగాహన పెరగడంతో పాటు విద్యార్థుల్లో పోటీ తత్వం కూడా అలవడుతుందన్నారు. ఎన్ఎంఎంఎస్‌లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శిక్షణ అందించి ప్రభుత్వ పాఠశాలల బతోపేతానికి కృషి చేయాలన్నారు. డీఎస్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తారన్నారు. ఉన్నతస్థాయిలో ఎదిగిన వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రగతిని సాధించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్యాచ్ స్కూల్ కిట్స్ డిస్ట్రిబ్యూషన్ డ్రైవ్‌లో భాగంగా పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్స్ అందించారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి, మినిస్టీరియల్ జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు, లక్ష్మారెడ్డి, జీహెచ్ఎం కొమ్ము శ్రీనివాసులు పాల్గొన్నారు. శాలిగౌరారం మండలంలోని వల్లాల మోడల్‌స్కూల్‌లో పల్‌రెడ్డి ఫౌండేషన్ బాధ్యులు పల్‌రెడ్డి రాంరెడ్డి విద్యార్థులకు సమకూర్చిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను జడ్పీసీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మెటీరియల్ దాత పల్‌రెడ్డి రాంరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కె.సంధ్యారాణి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో లక్ష్మీనృసింహుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 25: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారలను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారలను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండీజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 8,71,022 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి

హాలియా, సెప్టెంబరు 25: పరిశుభ్రతపై విద్యార్థులు, తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని పర్యావరణ ఇంజనీర్ రవి అన్నారు. స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా హాలియాలోని జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేరు చేసే విషయాలపై అవగాహన కల్పించారు. హాలియాను స్వచ్ఛ హాలియాగా మార్చే విషయంలో విద్యార్థులు, యువత తమ పాత్రను పోషించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భవాని, స్కూల్ స్టాఫ్, మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్ సైదులు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం 589.10 అడుగులు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 25: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రం 589.10 అడుగులుగా ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 49,234 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 589.10 అడుగులుగా(309.3558టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5018 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,582 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 46,120 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా, ఎగువనుంచి 49,234 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా వస్తుంది. ఎగువ మూసీ నది పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నాలుగు రోజులుగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఇప్పటికే ప్రాజెక్టు 645 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉండటం, మరిన్ని రోజుల పాటు వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ప్రాజెక్టు 2, 3, 7 నెంబర్ క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి ఎగువనుంచి వస్తున్న వరద నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి 3390.14 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా మూడు క్రస్టుగేట్ల ద్వారా 2744.77 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 435.78 క్యూసెక్కులు మొత్తం 3240.77 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగుల(4.46టీఎంసీ) నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.95 అడుగులుగా (4.179టీఎంసీ) ఉంది. రెండో విడతగా కుడి కాల్వకు 169.47 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 265.31 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

'పులిచింతల'కు నిలకడగా వరద ప్రవాహం

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నిలకడగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు వారం రోజులుగా ప్రాజెక్టు ఒక గేటు ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు(45.77 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 174.86 అడుగులుగా(45.56 టీఎంసీలు) నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 33,460 క్యూసెక్కులు వరద ప్రవాహం కొనసాగుతుండగా ఒక గేటును 2.5 మీటర్ల ఎత్తు లేపి 20,950 క్యూసెక్కుల నీటిని, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 108 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు నుంచి అవుట్‌ఫ్లో 36,950 క్యూసెక్కులుగా నమోదైంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మఠంపల్లి, సెప్టెంబరు 25: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోదుగు జాన్‌రెడ్డి ఉదయం ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. అనుమానం వచ్చిన వారు బీరువాను పరిశీలించగా రూ.10 వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు, రెండు జతల దిద్దులు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. వాటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు జాన్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి

కోదాడ, సెప్టెంబరు 25: సూర్యాపేట జిల్లా కోదాడ పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. కోదాడ పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని అనంతగిరి రోడ్డు నివాసముంటున్న సతీష్, భార్య అపర్ణ, బావమరిది భద్రయ్య, మరికొందరితో కలిసి చేపల కోసం కోదాడ పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో సతీష్ చేపల గాలం విద్యుత్ పోల్‌కు తగిలించి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన భార్య, బావమర్ది వెంటనే నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సాయంత్రం సతీష్ మృతిచెందాడు సతీష్ భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోటారుకు మరమ్మతులు చేస్తుండగా..

వలిగొండ, సెప్టెంబరు 25: ఇంటి వద్ద మోటారు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు వ్యక్తి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వెల్వర్తి గ్రామంలో బుధవారం గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల రవి తన ఇంటి వద్ద మోటారు రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఛాతీ మీద గాయాలు కాగా చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు

వివాహిత ఆత్మహత్యాయత్నం

వలిగొండ, సెప్టెంబరు 25:ఫినాయిల్ తాగి వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఎదుల్లగూడెం గ్రామానికి చెందిన బర్మ అఖిల(22) ఇంట్లో ఉపయోగించే ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం సిబ్బంది భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

పాత బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 25: యాదగిరిగుట్ట పాత బస్టాండ్‌లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. బస్టాండ్‌లోని ఓ బెంచీపై పడుకొని ఉండడాన్ని గమనించి కంట్రో లర్ గొల్లూరి ఇస్తారి సుమారు మధ్యాహ్నం నిద్ర లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించాడు. మృతుడు చామనఛాయ రంగులో ఉండి శరీరంపై ఆకుపచ్చ రంగు షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ఉంది. కంట్రోలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మనస్తాపంతో మిర్చిబండి వ్యాపారి ఆత్మహత్య

భువనగిరి టౌన్, సెప్టెంబరు 25: మనస్తాపంతో మిర్చిబండి వ్యాపారి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లాలో బుధవారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి అర్బన్ కాలనీకి చెందిన నిడిగొండ శివప్రసాద్(42) ఉదయం చేనేత కార్మికుడిగా పనులు చేసి సాయంత్రం పట్టణ ప్రధాన రహదారిపై మిర్చి బండి నిర్వహించేవాడు. అయితే కొద్ది రోజులు క్రితం శివప్రసాద్ మధ్యవర్తిగా ఉండి తెలిసిన వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి కొందరికి డబ్బులు అప్పుగా ఇప్పించాడు. సదరు వ్యక్తులు వడ్డీ, అసలు చెల్లించకపోతుండడంతో వడ్డీ వ్యాపారి శివప్రసాద్‌పై ఒత్తిడి తెచ్చారు. దీంతో శివప్రసాద్ మనస్తాపంతో స్థానిక ఆర్‌బీనగర్‌లో మిర్చి బండి నిర్వహణకు అద్దెకు తీసుకున్న ఓ గదిలో మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం ఉదయం ఫ్యాన్‌కు వేలాడుతుండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కుమారస్వామి సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. శివప్రసాద్‌కు కుమారుడు, కూతురు భార్య, ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

11 మంది ఎస్ఐలకు స్థానచలనం

నల్లగొండ క్రైం, సెప్టెంబరు 25 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న 11 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు.

ఎస్ఐ	ప్రస్తుతం	బదిలీ
వి.మహేశ్వర్	నల్లగొండ(డీఎస్‌బీ)	సూర్యాపేట(డీఎస్బీ)
వెంకటేశ్వర్లు	నల్లగొండ(వీఆర్)	సూర్యాపేట(డీఎస్బీ)
ఎస్‌కె.సైదులు	నల్లగొండ(డీసీఆర్‌బీ)	కోదాడటౌన్
కె.కృష్ణయ్య	మిర్యాలగూడటూటౌన్	మాడ్గులపల్లి
జి.శోభన్‌బాబు	మాడ్గులపల్లి	నల్లగొండ(వీఆర్)
డి.వెంకటేశ్వర్లు	సూర్యాపేట(డీసీఆర్‌బీ)	వేములపల్లి
డి.విజయ్‌కుమార్	వేములపల్లి	నల్లగొండ(వీఆర్)
పి.లోకేష్‌కుమార్	సూర్యాపేటటౌన్	మిర్యాలగూడరూరల్-1
సందీప్‌రెడ్డి	నల్లగొండ వన్‌టౌన్	మిర్యాలగూడరూరల్-2
వి.శేఖర్‌ను	మిర్యాలగూడ వన్‌టౌన్	అడవిదేవులపల్లి
బి.సాయిప్రశాంత్	సూర్యాపేట(సీసీఎస్)	తిప్పర్తి

గ్రామాల్లో ఇన్‌చార్జిల పంచాయితీ

» సెలవులపై వెళ్లిన కొన్ని గ్రామ కార్యదర్శులు
» రోజులు గడుస్తున్నా విధుల్లో చేరకపోవడంతో అధికారుల నోటీసులు
» గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు



సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 24: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పాలన పూర్తికావడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో మొత్తం 46 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాలా గ్రామపంచాయతీల్లో కార్యదర్శులకు విధులు నిర్వహించడం కష్టతరంగా మారింది. పారిశుధ్యం, మంచినీటి సరఫరా తదితర సమస్యలను కార్యదర్శులు తమ గ్రామాల్లో పనులు చేపడుతున్నా సమస్యలు పరిష్కారమయ్యే పరిస్థితులు లేవని ప్రజలు పేర్కొంటున్నారు. వెంకటాద్రిపాలెం, జంకుతండా, బోట్యా నాయక్‌తండా, జప్తివీరప్పగూడెం, వాటర్‌ట్యాంక్‌తండాలకు చెందిన కార్యదర్శులు సెలవులు పెట్టినా గ్రామాల్లో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఉన్నతాధికారులు వాటిని మంజూరు చేయలేదు. ఇతర గ్రామాల కార్యదర్శులకు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏ గ్రామపంచాయతీల్లో సమస్యలు పరిష్కరించుకోవాలో అర్థం కాని దుస్థితి. సెలవు పెట్టుకున్న ఆయా గ్రామాల కార్యదర్శులకు విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఐదు రోజుల క్రితం షోకాజ్ నోటీసులు పంపారు. గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో కార్యదర్శులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామపంచాయతీల్లో సీజనల్ వ్యాధులు విస్తృతమవుతున్న సందర్భంలో శానిటేషన్, వాటర్ సప్లయ్ పైపులైన్లు తదితర సమస్యల పరిష్కారానికి సమయం సరిపోవడం లేదని తెలుపుతున్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు లేమి కారణంగా గ్రామాల అభివృద్ధి కష్టతరమవుతున్న సందర్భంలో పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులతోపాటు అప్పులు చేసి ఖర్చు చేస్తున్నారు. సెలవులపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన గ్రామపంచాయతీలను ఇన్‌చార్జిలుగా అప్పగించిన వాటిలో కూడా సొంత డబ్బులు ఖర్చు చేసి అభివృద్ధి చేయాలని ఒత్తిడి చేస్తున్నారని పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామ పంచాయతీలకే తమ సొంత డబ్బులను ఖర్చు చేయలేక సతమతమవుతున్నసందర్భంలో ఇన్‌చార్జిగా ఉన్న గ్రామపంచాయతీలకు సైతం డబ్బులు ఖర్చు చేయాలని ఆదేశాలు వస్తుండడంతో ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించడం భారంగా మారిందని పేర్కొంటున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలు మరో 3,4 నెలలు పడుతుందని అప్పటివరకు ఎలాంటి బిల్లులు అందకుండా గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించడం ఆర్థిక భారంగా మారనుందని పలువురు పేర్కొంటున్నారు.

కార్యదర్శులు విధుల్లో చేరాలి

సెలవులపై వెళ్లిన కార్యదర్శు లు విధుల్లో చేరి తక్షణమే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం గ్రామాల్లో ప్రజా పాలన సవ్యంగా సాగే విధం గా తగిన చర్యలు చేపట్టాలి. సీజనల్ వ్యాధుల బారి న పడకుండా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను వారికి అందేలా చర్యలు తీసుకోవాలి.

\- శేషగిరిశర్మ, ఎంపీడీవో.

సస్పెండ్ చేసిన పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలి

నల్లగొండ జిల్లాలో అకారణంగా సస్పెండ్ చేసిన పంచాయతీ కార్యదర్శులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అధికారుల ఒత్తిళ్ల నుంచి తమను రక్షించాలని కోరుతూ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు డివిజన్ పంచాయతీ కార్యదర్శులు మిర్యాలగూడలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైనప్పటి నుంచి గ్రామాలకు నిధుల కొరత ఏర్పడడంతో తాము అప్పులు తీసుకొచ్చి మరీ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను, పారిశుధ్య పనులను చేపడుతూ ప్రజల ఇబ్బందులు తొలగిస్తున్నామని అన్నారు. పంచాయతీరాజ్ చట్టంలో లేనప్పటికీ గ్రామపంచాయతీల్లో పనులను చేపట్టేందుకు సొంత డబ్బులను వెచ్చించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారని, అలా చేయకపోతే గ్రామాల్లో పనులు చేపట్టడం లేదని ఆరోపిస్తూ తమను బెదిరిస్తున్నారని, సస్పెండ్ చేస్తున్నారని పేర్కొంటున్నారు. చట్టంలో లేకపోయినా పేద కుటుంబాలకు చెందిన తాము లక్షల రూపాయలను ఎక్కడి నుంచి అప్పులు తీసుకొచ్చి పెట్టాలని ప్రశ్నిస్తున్నారు. తమ సొంత డబ్బులతో గ్రామ పంచాయతీలకు ఖర్చు పెట్టలేమని, ఇప్పటివరకు తాము గ్రామపంచాయతీలకు ఖర్చు చేసిన బిల్లులు రావడం లేదంటున్నారు. అకారణంగా సస్పెండ్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉన్నతాధికారుల ఒత్తిళ్ల నుంచి రక్షించాలని కోరారు. సమస్యలను పరిష్కరించేంతవరకు తమకు సామూహిక సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కోడిరెక్క శైలజ, నరేష్, రామకృష్ణ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

● శాలిగౌరారం మండలంలో నీట మునిగిన పొలాలు ● దేవరకొండ మండలం తాటికోలు గ్రామంలో కూలిన ఇల్లు



శాలిగౌరారం నుంచి ఉట్కూర్ వెళ్లే రోడ్డులో ప్రవహిస్తున్న వరద నీరు

శాలిగౌరారం, సెప్టెంబరు 25: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం పలు చోట్ల వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయి. శాలిగౌరారం నుంచి మాదారం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ఉట్కూర్ సమీపంలోని కాజ్‌వేలో నీరు రోడ్డు దాటకుండా ఉధృ తంగా ప్రవహిస్తోంది. దాంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పలు రోడ్లు దెబ్బతిన్నాయి. శాలిగౌరారం, లింగోటం, తిరుమలరాయినిగూడెం, ఉట్కూరు, అడ్లూర్ గ్రామాల్లో వరి, పత్తి చేలు వరద నీటిలో మునిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ఇసుక మేట వేశాయి. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



తాటికోలులో కూలిన ఇల్లు

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తాటికోలు గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి ఇల్లు కురుస్తున్న వర్షాలకు కూలిపోయి ంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నిరుపేద కుటుంబానికి చెందిన దస్తగిరి కూలి పని చేస్తు జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా కూలిన దస్తగిరి ఇంటిని బుధవారం పంచాయతీ కార్యదర్శి మూర్తి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్‌కు నివేదిక అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

గరిడేపల్లి: బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని అబ్బిరెడ్డిగూడెం, సుభాష్‌నగర్ గ్రామాల మధ్య గల తాళ్లవాగు ఉధృతంగా ప్రవహించి రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు, వ్యవసాయ దారులు, పట్టణానికి వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. అనంతరం సాయంత్రానికి ఉధృతి తగ్గిన తర్వాత గ్రామాల మధ్య రాకపోకలు కొనసా గాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లోలెవల్ వంతెనను తొలగించి పూర్తిస్థాయిలో వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



శాలిగౌరారం బస్ స్టేజీ వద్ద ఇసుక మేట వేసిన వరి పొలం

రామన్నపేట: వర్షం కురిస్తే స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణ మడుగును తలపిస్తుంది. వర్షపు వరద నీరు వెళ్లడానికి కాల్వ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నీరు మడుగును తలపిస్తోంది. ఆ నీటిలో దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల గృహాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరద నీరు పోవడానికి కాల్వలు ఏర్పాటు చేయమని అధికారులకు కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలుతున్న ఇలాంటి తరుణంలో తమకు వ్యాధులు సోకుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మడుగును తలపిస్తున్న రామన్నపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణ

సాగర్ ఎడమ కాల్వలో ఇద్దరు గల్లంతు

● దుస్తులు ఉతికేందుకు వెళ్లిన ముగ్గురు ● ఒకరిని కాపాడిన స్థానికులు ● బొక్కమంతలపహాడ్ వద్ద ఘటన

నిడమనూరు, సెప్టెంబరు 25: దుస్తులు ఉతికేందుకు వెళ్లిన ముగ్గురు ప్రమాదవశాత్తు నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో జారి పడి గల్లంతయ్యారు. వారిలో ఒకరిని స్థానికులు రక్షించగా, మరో ఇద్దరు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. బుధవారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్ వద్ద ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... త్రిపురారం మండల కేంద్రానికి చెందిన వేమారపు సాయి(25) స్థానికంగా కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మేదరి శైలజ(24), అవిరెండ్ల రమాదేవి(23) అతని కూరగాయల దుకాణంలో పని చేస్తున్నారు. సాయి కుటుంబానికి చెందిన ఒకరు స్వామి మాల వేస్తున్నందున ఇంట్లో ఉన్న దుస్తులు శుభ్రం చేసేందుకు సాగర్ కాల్వకు వెళ్లాలనుకున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న దుస్తులు మొత్తం ఉతికేందుకు టాటాఏస్ వాహనం తీసుకొని సాయితో పాటు రమాదేవి, శైలజ కూడా నిడమనూరు మండల పరిధిలో బొక్కమంతలపహాడ్ వద్ద ఉన్న సాగర్ కాల్వకు బుధవారం సాయంత్రం వెళ్లారు. కాల్వలో దుస్తులు ఉతికి పైకి వస్తున్న క్రమంలో శైలజ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి కేకలు వేస్తుండగా ఆమెను రక్షించే ప్రయత్నంలో సాయి కూడా కాల్వలోకి దూకాడు. ఇద్దరు కేకలు వస్తుండగా భయంతో రమాదేవి కూడా కాల్వలో దూకింది. ముగ్గురికీ ఈత రాకపోవడంతో కేకలు వేస్తూ నీటిలో కొట్టుకుపోతున్నారు. కాల్వలో కేకలు వినిపించడంతో బొక్కమంతలపహాడ్ గ్రామానికి చెందిన దర్మారపు సైదులు, దర్మారపు జానయ్య వెంటనే చీర సహాయంతో రమాదేవిని పైకి లాగి ఒడ్డుకు చేర్చారు. సాయి, శైలజను కాపాడలేకపోవడంతో ఇద్దరు నీటిలో గల్లంతయ్యారు. కాల్వలో ఇద్దరు గల్లంతైన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రమాదేవిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని కేసు నమోదు చేసుకొని ఎస్ఐ గోపాలరావు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో త్రిపురారంలో విషాదం నెలకొంది.




సాయి(ఫైల్), శైలజ (ఫైల్)

నెస్ట్స్ సభ్యుడిగా డాక్టర్ శరత్

మిర్యాలగూడఅర్బన్, సెప్టెంబరు 25: నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబుల్ స్టూడెంట్స్ (నెస్ట్స్) సభ్యుడిగా గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్ ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శరత్ నియామకం పట్ల బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల్లోని గిరిజన జనాభాలో అక్షరాస్యత పెంపొందించేందుకు శరత్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన వెంట గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు సూర్యానాయక్, మాన్యనాయక్, శ్యామ్‌నాయక్ ఉన్నారు.

కారు డివైడర్‌ను ఢీకొని ముగ్గురికి గాయాలు

మోతె, సెప్టెంబరు 25: డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలకేంద్రంలోని సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన ఇమ్రాన్, ఖరీముల్లా, ముస్తఫా, సాయితేజ కారులో హైదరాబాద్‌లో పనుల నిమిత్తం వెళ్లి తిరిగి ఖమ్మం వెళ్తున్నారు. ఈ క్రమంలో మోతె గ్రామశివారులో ఉన్న ఫ్లై ఓవర్ మీద అతివేగంతో కారు వస్తున్న రోడ్డుపై డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇమ్రాన్, సాయితేజ తలకు గాయాలయ్యాయి. ఖరీముల్లా, ముస్తాఫాలకు స్వల్ప గాయాల య్యాయి. నేషనల్ హైవే 1033 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిర్వహించి ఖమ్మం తరలించారు.

ఇసుక మాయాజాలం

● మోతె మండలంలో ఇసుకకు గిరాకీ
● నిల్వ ఉంచిన ఇసుక భారీ ధరకు విక్రయం
● ట్రాక్టర్ లోడు రూ.10వేలు పలుకుతున్న వైనం
● అధికారులు సీజ్ చేసిన డంపులూ మాయం



మోతె మండలంలోని నర్సింహాపురం గ్రామంలో డంపు చేసిన ఇసుక

మోతె, సెప్టెంబరు 25: సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని పలు గ్రామాల్లో భారీగా ఇసుక డంపులు ఉన్నాయి. డంపు చేసిన వారు భారీ ధరకు ఇసుక విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ లోడు రూ.10వేలు విక్రయిస్తున్నట్లు సమాచారం. మండలంలో ఇసుక కొరత సృష్టించడంతో సీసీరోడ్లు, ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడుతోంది. దీంతో నిర్మా ణాలు ఆగిపోతున్నాయి. గతంలో అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపులు కూడా మాయమవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మోతె మండల పరిధిలోని పాలేరు వాగుకు వెంట ఉన్న రైతుల పంటలు నీట మునిగి వరదల్లో వరి పంటచేలు కొట్టుకుపోవడంతో రైతులకు నష్టం జరిగింది. ఇసుక అక్రమంగా తరలించే వారికి పంట చేలల్లో చేరిన ఇసుక కాసులు కురిపిస్తోంది. దీనికితోడు వరదలు రావడంతో ఇసుక దొరకకపోవడంతో డంపు చేసినవారు ట్రాక్టర్ లోడు రూ.10వేలకు విక్ర యిస్తున్నారు. ఇసుక డంపులు చేసిన వారికి అధికారులు, నాయకుల మద్దతు ఉండడంతో చెప్పిన ధరకు విక్రయిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు, సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టే వారికి ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలు నిలిచి పోతున్నాయి. ఇదే అదునుగా ఇసుక ధరలు రూ.10 వేలకు పైబడే పెంచారు. వేసవిలో పాలేరు వాగు నుంచి ఇసుకను తరలించి డంపు చేసిన నిల్వలను అధికార పార్టీ నాయకుల ఫిర్యాదులతో నర్సింహాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు.

మాయమవుతున్న సీజ్ చేసిన ఇసుక డంపులు

మండలంలోని నర్సింహాపురం, తుమ్మగూడెం, నేరేడువాయి, రంగాపురం తండా, రాయికుంటతండా, ఉర్లుగొండ గ్రామాల్లో వందల సంఖ్యలో 200 టిప్పుల ట్రాక్టర్ లోడులు పైబడే సుమారు 100 వరకు అన్ని గ్రామాల్లో డంపులు ఉన్నాయి. వాటిని అధికారులు చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

ఇతర జిల్లాలకు తరలుతున్న ఇసుక

రాత్రి, పగలు తేడా లేకుండా డంపులు చేసిన ఇసుకను మోతె మండలంతో పాటు కోదాడ, ఖమ్మం, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం గ్రామాలకు తరలిస్తున్నారు. నర్సింహాపురం గ్రామానికి చెందిన ఇసుక వ్యాపారులు నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నా నాయకుల ఒత్తిడితో చర్యలు చేపట్టడడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇసుక లోడులతో ట్రాక్టర్లు వెళ్తుండడంతో నర్సింహాపురం-ఉర్లుగొండ బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకుపోయి పెద్ద, పెద్ద గోతులు ఏర్పడాయి. అయినా ఇసుక వ్యాపారులు గోతుల్లో నుంచే తరలిస్తున్నారు. ఈ గ్రామాలకు చెందిన నాయకులు ఇసుక డంపులు నిల్వచేసిన వారిపై చర్యలు చేపట్టకుండా ఉండేందుకు లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో డంపులు చేసిన వారు రాత్రి, పగలు అనే తేడాలేకుండా ఇసుక తరలిస్తున్నారు. వర్షాలు, వరదలు తగ్గడంతో పాలేరు వాగు వెంట ఉన్న రైతుల పొలాల్లోకి చేరిన ఇసుక మేటలను తరలించేందుకు నర్సింహాపురం, ఉర్లుగొండ గ్రామాలకు చెందిన ఇసుక వ్యాపారులు పొలంలో ఉన్న ఇసుక మేటలను తీసుకెళ్తాం 'నీకు ఎంత ఇవ్వాలి' అని రైతుల చుట్టూ తిరుగుతున్నారు. డంపులు సీజ్‌చేసిన వాటిని తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాలకు చెందినవారు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

సీజ్‌చేసిన ఇసుక డంపులు తరలిస్తే చర్యలు



గతంలో నర్సింహాపురం, ఉర్లుగొండ, తుమ్మగూడెం గ్రామాల్లో ఇసుకను అక్రమంగా డంపులు చేసిన వారి వివరాలు సేకరించి వారికి సీజ్‌చేసిన ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు, రెవీన్యూ అధికారులు పంచనామ నిర్వహించి వారికి తెలియజేయడం జరిగింది. ఇసుక డంపులు నిల్వచేసిన గ్రామాల్లో రెవీన్యూ అధికారులు పరిశీలన చేపట్టి నిల్వలను సీజ్‌చేయడం జరుగుతుంది.

● సంఘమిత్ర, మోతె తహసీల్దార్.

ఇసుక డంపులను స్వాధీనం చేసుకోవాలి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక వ్యాపారులు అక్రమంగా నిల్వల చేసిన వందలాది ఇసుక డంపులను స్వాధీనం చేసుకోవాలని. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించాలి. సామాన్యులు ఇసుక కొనుగోలు చేయాలంటే భయపడుతున్నారు. ఇసుక అక్రమంగా నిల్వ చేసిన వారికి నాయకులు కొమ్ముకాయడం మానుకోవాలి. ఈ పది గ్రామాల్లో నిల్వలు ఉన్న వాటిని గుర్తించి ఇక్కడి నుంచి తరలించాలి.

● సైదులు సామాజిక కార్యకర్త మోతె మండలం

'డిండి'కి డీపీఆర్‌ను ఆమోదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారి ఐలయ్య

డిండి, సెప్టెంబరు 25: డిండి ఎత్తిపోతల పథకానికి డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య డిమాండ్ చేశారు. మండలంలోని టి.గౌరారం గ్రామంలో బుధవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో జీవో 107 ద్వారా అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం రోజు అర టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీల నీరు తీసుకోవాలని ప్రతిపాదించింది. 30 టీఎంసీల నీటిని జిల్లాలోని సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, లక్ష్మణాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లు నింపి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలలోని భూములకు సాగునీరు అందించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. డీపీఆర్ మాత్రం ఆమోదించకపోవడంతో బడ్జెట్‌లో సరైన నిధుల కేటాయింపు జరగడంలేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆమోదించి పర్యావరణ అనుమతుల కోసం లేఖ రాసి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నల్ల చిన్నవెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు నల్ల వెంకటయ్య, బుడిగె వెంకటేషం, పార్వతమ్మ, నల్ల లక్ష్మణ్, నరసింహ, మంజుల, శ్రీనివాస్, నరసింహ, భారతమ్మ పాల్గొన్నారు.

అందరికీ సాయినాథుని ఆశీస్సులు ఉండాలి


సాయిసన్నిధిలో టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

చింతపల్లి, సెప్టెంబరు 25: సమాజంలోని ప్రతి ఒక్కరికీ సాయినాథుని ఆశీస్సులు ఉండాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షీర్డి సాయిబాబా (సాయిసన్నిధి)లో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎల్లప్పుడు కృషి చేస్తుందని అన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి మేకల జనార్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాల్వాయి వాసుదేవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు జగ్రామ్, నారాయణరెడ్డి, మాతంగి మల్లిఖార్జున్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంకలో కమ్యూనిస్టుల గెలుపు శుభసూచకం

గట్టుప్పల్, సెప్టెంబరు 25: శ్రీలంకలో మార్క్సిస్టు నాయకుడైన అనురకుమార దిశనాయకేను గెలిపించడం శుభసూచకమని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. గట్టుప్పల్ మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో బుధవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు ఆర్థిక విధానాలతో శ్రీలంక ప్రజల జీవితాలను గత ప్రభుత్వం కష్టాలు, కడగండ్లకు గురిచేసినట్లు తెలిపారు. ప్రారంభ సూచికగా సీపీఎం జెండాను పార్టీ సీనియర్ నాయకుడు టి.గోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం, సీపీఎం మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, నాయకులు చాపల మారయ్య, ధనుంజయ గౌడ్, సుధాకర్, కృష్ణ, అబ్బయ్య, యాదగిరి, సైదులు, బుచ్చయ్య, నరసింహ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

నిడమనూరు, సెప్టెంబరు 25: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. నిడమనూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల హక్కులను కాలరాస్తూ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా జమిలి ఎన్నికలు నిర్వహించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు అమలుచేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, కొమాండ్ల గుర్వయ్య, ఆకారపు నరేష్, కుంచం శేఖర్, చరణ్‌రాజ్, చంద్రశేఖర్, కేశవులు, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లయ్య, కోటయ్య, చంద్రయ్య, లాలు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం



ఎంఈఓలను సన్మానిస్తున్న టీపీఆర్టీయూ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 25: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పరిరక్షణ కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని టీపీఆర్టీయూ మండల అధ్యక్షుడు కేతావత్ మూనా అన్నారు. ఉమ్మడి మండలంలో ఎంఈవోలుగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఎ.వెంకటయ్య, సముద్రాల శ్రీనయ్యను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతులను చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తరాల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు

మర్రిగూడ, సెప్టెంబరు 25: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నడిపితే చర్యలు తప్పవని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న 27మందికి బుధవారం పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో 24 గంటలు మద్యాన్ని విక్రయించడం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఇప్పటికే పలుమార్లు బెల్ట్‌షాపులు నడిపే వారిపై కేసులు నమోదు చేశామని, అయినా వారిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఇకపై కఠినచర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్‌షాపులు నడిపే వారి సమాచారం యువత పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మద్యం అమ్మిన వారికి జరిమానా విధించడంతోపాటు వారిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయనున్నట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మర్రిగూడ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న దుగ్గేపల్లి గ్రామ యువకులు

త్రిపురారం, సెప్టెంబరు 25: త్రిపురారం మండలంలోని దుగ్గేపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కందుల రాములమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 22వ తేదీన మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పొలగాని వెంకట్‌గౌడ్ బుధవారం గ్రామ యువత ద్వారా కుటుంబ సభ్యులకు రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. ఫోన్‌లో మాట్లాడి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు మోసంగి శంకర్, పోలగాని శేఖర్, కొండెబోయిన సంతోష్, సత్యనారాయణ, కలిమేల చింటు, రవి, ఓంకారం, శంకర్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సత్యం ఖరారు

నిడమనూరు, సెప్టెంబరు 25: సాగర్ నియోజకవర్గంలో కీలకమైన నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియామకానికి ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆమోదం తెలిపారు. దీంతో త్వరలో నియామక ఉత్తర్వులు రానున్నాయి. చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, రంగశాయిరెడ్డి ప్రధాన అనుచరుడు అంకతి సత్యంను నియమించారు. వైస్‌చైర్మన్‌గా త్రిపురారం మండలానికి చెందిన బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లుగా నిడమనూరు మండలం నుంచి వంగాల అనిల్‌రెడ్డి, పాల్వాయి చంద్రశేఖర్‌రెడ్డి, యాకూబ్ అలీ, మన్నెం శంకర్, మెండె వెంకటేశ్వర్లు, సఫావత్ శ్రీను, త్రిపురారం మండలం నుంచి అనుముల మంజుల, పరశురాంగౌడ్, గంగుల గుర్వయ్య, సుందరయ్య, ట్రేడర్లుగా బెలిదె అశోక్, మధుసూదన్ పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం.

సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలి


దేవరకొండలో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దేవరకొండ, శాలిగౌరారం, కట్టంగూరు, వేములపల్లి, పెద్దఅడిశర్లపల్లి, కనగల్, కొండమల్లేపల్లి, పెద్దవూర, మాడ్గులపల్లి, సెప్టెంబరు 27: గుర్రంపోడు ఎంపీడీవోతో పాటు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్ ఎత్తివేయాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో బుధవారం ఎంపీడీవో కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం సామూహిక సెలవుల కోసం ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు. గుర్రంపోడు ఎంపీడీవోతో పాటు సస్పెండ్ చేసిన కార్యదర్శులను విధుల్లోకి తీసుకునే వరకు సామూహిక సెలవుల్లో కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ 9 నెలల నుంచి గ్రామపంచాయతీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి ఆర్థికంగా ధైర్యం కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు భారంలేకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఒకవైపు సర్పంచుల బాధ్యతలను అప్పగించడంతో పాటు మరోవైపు ఉపాధి హామీ పనులను, ప్రజాపాలన వంటి పలు రకాల పని భారాన్ని మోపి విధులు నిర్వహించాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకవైపు పనిభారంతో ఇబ్బందులు పడుతుంటే మరోవైపు గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. పని భారంతో పాటు ఆర్థికభారం పడుతున్నా అధికారులు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

● జిల్లాలో సస్పెండ్ చేసిన పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని దేవరకొండ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. దేవరకొండ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఇన్‌చార్జి ఎంపీడీవో నీలిమకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు నిరంజన్, కిరణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో ఎంపీవో పద్మకు, సూపరింటెండెంట్ సుందరయ్యకు కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు కెఎన్ చారి, అధ్యక్షుడు చింత నరేందర్, ఉపాధ్యక్షుడు జె.వెంకన్న, మహేశ్వరం విజయ్‌కుమార్, కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సామూహిక సెలవుల కోసం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జయసుధ, అశోక్, సాయి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

● వేములపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కార్యదర్శులు రాంరెడ్డి, శ్రవణ్, నాగరాజు, సామ్రాజ్యం, దివ్య, సబిత, సతీష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లిలో ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల 31 గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని జీపీ కార్యదర్శులు మూకుమ్మడి సెలవులు కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాములుకు వినతిపత్రం అందించారు.

● కొండమల్లేపల్లిలో ఎంపీడీవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు జైహింద్, కార్యదర్శులు సరస్వతి, వెంకటయ్య, కిరణ్, శ్రావణ్‌కుమార్, డాకు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవూర మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులు పెడుతూ ఎంపీడీవో ఉమాదేవికి సెలవుపత్రాన్ని అందజేశారు. జిల్లాలోనే పంచాయతీ కార్యదర్శులపై అధిక ఒత్తిడి ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సోషల్ ఆడిట్ నిర్వహించి వంద శాతం మొక్కలను చూపించాలంటున్నారని, కానీ చట్టంలో 80 శాతం మొక్కలను చూపిస్తే చాలని చెబుతున్నా అదే సాకుగా చూపి కార్యదర్శులను సస్పెండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్యామ్‌సుందర్‌రెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, మాధవి, లక్ష్మీ, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

●మాడ్గులపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సతీష్, సరిత, షకీరాబేగం, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.


పెద్దవూరలో ఎంపీడీవో ఉమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

'కల్యాణలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, సెప్టెంబరు 25: ప్రభుత్వం మంజూరు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 54 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఎంతో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి, తహసీల్దార్ జమీరుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్ యానాల సుకన్య, నాయకులు చౌగోని, యాసారపు వెంకన్న, మట్టిపల్లి వీరు తదితరులు పాల్గొన్నారు.

పండింట్ దీన్‌దయాళ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి


దీన్‌దయాళ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వర్షిత్‌రెడ్డి, చొక్కారావు

నల్లగొండ, మిర్యాలగూడ టౌన్, దేవరకొండ, కనగల్, సెప్టెంబరు 25: పండింట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గొల్లగూడ సూరదాసు భవన్‌లో డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో బుధవారం దీన్‌దయాళ్ జయంతిని నిర్వహించారు. దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొనుగోటి చొక్కారావు ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డ్వాబ్ ప్రధాన కార్యదర్శి ఏబీసీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు మాట్లాడుతూ అక్టోబరు 1వ తేదీన హైదరాబాద్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి దాతలు, శ్రేయోభిలాషులు హాజరుకావాలని, వారందరినీ ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దామోదర్‌రావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


● మిర్యాలగూడ పట్టణంలో పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాధినేని శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం, దేశం కోసం పనిచేసిన మహనీయులను మరువరాదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, కనపర్తి సత్యప్రసాద్, బంటు సైదులు, అజయ్, రవికుమార్, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, నాయకులు నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, నారాయణదాసు చండీశ్వర్, ఉప్పల వెంకటేష్, రెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● కనగల్‌లో బీజేపీ నాయకులు పండిట్ దీన్‌దయాళ్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పులకరం బిక్షం. ప్రధాన కార్యదర్శి దాసరి వెంకన్న, నాయకులు బైరగోని అశోక్, పిండి పాపిరెడ్డి, ఆదిమళ్ల దేవేందర్, పంతంగి సైదులు, బిక్షం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు



దేవరకొండలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

దేవరకొండ, సెప్టెంబరు 27: సంక్షేమ వసతిగృహాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. దేవరకొండలో బుధవారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతిగృహాల విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. వర్షాలు కురుస్తున్నందున దోమల బెడద లేకుండా దోమ తెరలు ఏర్పాటు చేసి వసతిగృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్, శివ, ప్రేమ్‌కుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గాడితప్పుతున్న విద్యారంగం : డబ్బీకార్ మల్లేష్

మిర్యాలగూడ: రాష్ట్రంలో విద్యారంగం గాడి తప్పుతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్ అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక రోజు దీక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని, మిర్యాలగూడ జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్, న్యూమాన్, ప్రసన్న వీరన్ననాయక్, సంపత్, నవదీప్, శ్రీకాంత్, దత్తు పాల్గొన్నారు.

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): జిల్లాలోని పలు మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వుల మేరకు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎంఈవోలు మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేస్తామని అన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సకాలంలో హాజరై విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంఈవోలను వివిధ సంఘాల నాయకులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.


సైదులు

● శాలిగౌరారం మండల విద్యాశాఖ అధికారిగా పెర్కకొండారం జడ్పీ హైస్కూల్ గెజిటెడ్ హెడ్మాస్టర్ మందుల సైదులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎంఈవో సైదులును అభినందించారు.


అమృతదేవి

● గట్టుప్పల్ ఎంఈవోగా అమృతదేవి బాధ్యతలు స్వీకరించగా గట్టుప్పల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇడం కైలాసం, కార్యదర్శి బీమగాని జంగయ్య ఆమెను సన్మానించారు.


వెంకన్ననాయక్

● నిడమనూరు ఎంఈవోగా లావూరి వెంకన్ననాయక్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఎంఈవోగా పనిచేసిన బాలు మిర్యాలగూడ మండలానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో తుమ్మడం జడ్పీ హైస్కూల్‌లో జీహెచ్ఎంగా పని చేస్తున్న వెంకన్నను ఎంఈవోగా నియమితులయ్యారు. వెంకన్నను పీఆర్టీయూ సంఘం నాయకులు పాంపాటి శ్రీనివాసులు, మంత్రాల సురేందర్‌రెడ్డి, గౌతం, కోటయ్య తదితరులు అభినందించారు.


రాజేంద్రప్రసాద్

● కేతేపల్లి ఎంఈవోగా మండలంలోని చెరుకుపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. మండల వనరుల కేంద్రంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రప్రసాద్‌ను వివిధ పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు అభినందించారు.

● డిండి ఎంఈవోగా గోప్యానాయక్ బాధ్యతలు స్వీకరించారు. చెర్కుపల్లి హైస్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న గోప్యానాయక్‌కు ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. డిండి ఎంఈవోగా పనిచేసిన సామ్యానాయక్ పోలేపల్లి పాఠశాలకు బదిలీపై వెళ్లారు.


అంజయ్య

● చింతపల్లి మండలంలోని ఘడియా గౌరారం జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎంగా పని చేస్తున్న ఎన్.అంజయ్య ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

● మాడ్గులపల్లి ఎంఈవోగా సీహెచ్.వెంకటమ్మ బాధ్యతలు చేపట్టారు. నూతన మండలంగా ఏర్పడిన తర్వాత మాడ్గులపల్లికి ఎంఈవో పోస్టు మంజూరు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోను వివిధ సంఘాల నాయకులు శాలువాల తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి, రఫి, భూక్యా లక్ష్మణ్, వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పద్మ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటయ్య, సముద్రాల శ్రీనయ్య

● పెద్దఅడిశర్లపల్లి ఉమ్మడి మండలంలో ఎంఈవోలు బాధ్యతలు స్వీకరించారు. పీఏపల్లి ఎంఈవోగా జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఎ. వెంకటయ్య, గుడిపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సముద్రాల శ్రీనయ్య బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు కేతావత్ మూనా, అనిల్‌కుమార్, పరమేష్, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య, బి.వెంకట్, లచ్చిరాం, జహంగీర్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.


శ్రీనివాస్

● తిరుమలగిరి(సాగర్) ఎంఈవోగా శ్రీనివాస్ నియమితులయ్యారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ మండల నోడల్ అధికారిగా కూడా ఆయన వ్యవహరిస్తున్నారు.

● కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వర్‌రావు ఎంఈవోగా నియమిస్తూ డీఈవోగా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టగా ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

● త్రిపురారం ఎంఈవోగా రమావత్ రవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, శివయ్య, మధు, మాలోత్ దశరథనాయక్, హరినాయక్, హనుమానాయక్, హెచ్ఎంలు గంగాధర్, రవికుమార్, వెంకట్, విష్ణుకుమార్, వరలక్ష్మి, లలిత, సైదులు బాబూరావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

హాలియా: భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాగర్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో బాల బాలికల కబడ్డీ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. కబడ్డీ పోటీల్లో ఫైనల్‌లో బాలుర ఫైనార్టీ గురుకుల, తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్, బాలికల బీసీ గురుకుల (తుమ్మడం), కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం హాలియా పాఠశాలలు తలపడనున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం గుండా కృష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, ఉపాధ్యాయులు ఎంకట్‌రాంరెడ్డి, డొనిమిక్, రాము, నరేష్, రాజేష్, గిరి రమేష్, కోటేష్, రమేష్, పరమేష్, సురేష్, మంగ్యానాయక్, జయకృష్ణా, పరమేష్, రవి, చందు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): ఈ నెల 28న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు. మెగా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకొని డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. సివిల్, క్రిమినల్ కేసులతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసుల్లో ఇబ్బందులు పడేవారు మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవరకొండ: విద్యార్థుల సమస్యల పరిష్కారానికై ఏబీవీపీ విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యలమల గోపిచంద్ అన్నారు. దేవరకొండలో ఏబీవీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఆసీఫ్, గణేష్, సంతోష్, వికాస్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): నేతాపురం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో మండలంలోని నేతాపురం, మేగ్యాతండా, శీత్లతండా, ధన్సింగ్‌తండా, గట్టుమీదితండా గ్రామపంచాయతీల సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాలు ప్రబలకుండా ఉండటానికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్తలు పద్మ, స్వప్న పాల్గొన్నారు.

● **చింతపల్లి:** క్రీడారంగంలో విద్యార్థులు యువత రాణించినప్పుడే మానసిక ఉల్లాసం పొందవచ్చని మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్ కుమార్ అన్నారు. మండలంలోని కుర్మేడ్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన ఆటలపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ విద్యార్థులు ఆటపోటీలతో పాటు సామాజిక అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాటకొండ రుద్రమాదేవి నరేంద్ర ప్రసాద్, ఉప్పు శ్రీశైలం, సింగిల్‌విండో డైరెక్టర్ అండేకార్ అశోక్, కుర్మేటిబజార్, గౌని జంగయ్య, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.


మర్రిగూడ: మండలకేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహదాత మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొలుకులపల్లి యాదయ్య, వెంకటంపేట శేఖర్, శంకర్, లింగయ్య, రాములు, నర్సింహ్మలు, పలువురు రజక సంఘం నాయకులు ఉన్నారు.

నేరేడుగొమ్ము: జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేసే పనుల్లో నీటి నిలువ పనులు చేయాలని టెక్నికల్ అసిస్టెంట్ ఇద్రీస్ తెలిపారు. నేరేడుగొమ్ము మండలంలోని కొత్తపల్లి, కేతేపల్లి గ్రామాల్లో ఉపాధి కోరే కూలీలు గ్రామాల్లో నీటి నిలువల పనులు, పాంపాండ్ పనులు చేపట్టాలని అన్నారు. ఇలాంటి పనులు చేయడం వల్ల కూలి అధికంగా రావడం, నీటి నిలువలతో భూమిలో సారవంతం పెరిగి పంటలు అధికంగా పండుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్లు దేవేందర్, కృష్ణ, మేట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ జీవో నెంబర్ 25ను ప్రభుత్వం వెంటనే సవరించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కాంప్లెక్ సమావేశంలో భాగంగా భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులందరూ ఐకాస ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ క్రమబద్ధీకరణ జీవో నెంబరు 25ను ప్రభుత్వం సవరించి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించి అదనంగా సీఎస్, హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉదావత్ లచ్చిరాం, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజు, శ్రీనివాసరావు, కృష్ణయ్య, నాగయ్య, నాగేంద్రమ్మ, మాలతి, స్వాతి పాల్గొన్నారు.

కనగల్: రేషన్‌కార్డు, కుటుంబసభ్యుల నిర్ధారణ లేకపోవటం వంటి కారణాలతో రుణమాఫీ వర్తించని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 298మంది రైతులు తమ భూ పట్టా పుస్తకాలు, ఆధార్ జీరాక్స్ పత్రాలను ఏవో కార్యాలయంలో, సంబంధిత ఏఈఓలకు అందించి రుణమాఫీ పొందాలని ఏవో అమరేందర్‌గౌడ్ కోరారు.

వల్లాల వాసికి ఓయూ డాక్టరేట్


గుండ్లపల్లి సుధాకర్

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన గుండ్లపల్లి సుధాకర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విభాగం నుంచి పీ హెచ్‌డీ డాక్టరేట్ పొందారు. 'స్టడీస్ ఆఫ్ ది గ్రౌండ్ వాటర్ క్వాలిటీ ఆఫ్ ది కట్టంగూరు సబ్- బేసిన్ ఫ్రమ్ ది నల్లగొండ డిస్ట్రిక్ తెలంగాణ స్టేట్, ఇండియా' అనే అంశంపై డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, హెచ్‌వోడీ జియాలజీ ఉస్మానియా యునివర్సిటీ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు ఆయన డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం సుధాకర్ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సుధాకర్‌కు డాక్టరేట్ రావడంపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కె.అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రేమ్‌సాగర్, హెచ్‌వోడీ డాక్టర్ కె.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ మద్దిలేటి, డాక్టర్ మశ్చేందర్, డాక్టర్ అంజనేయులు, వెంకటేష్, బొడ్డు వీరస్వామి హర్షం వ్యక్తం చేశారు.